రాత్రి ఏడింటికిగాని జ్వాల కదలేదు. మాచవరానికి రిక్షా మాట్లాడుకుంది, ఆఫీస్ మేనేజర్ యింటికి. ఏడున్నరకి ఓ లారి ఆ రిక్షాని ఎస్. ఆర్. ఆర్ కాలేజీకి కొద్దిగా ఇవతలగా గుద్దేసింది. ఆమెని వెంబడిస్తున్న డిటెక్టివ్ వెంటనే ఆమెని హాస్పటల్ లో చేర్పించక పోతే మరణం తప్పేదికాదు.

బుధవారం

హాస్పటల్లోంచి కదలేదు. మీ ఆఫీస్ మేనేజర్ వచ్చి నాలుగు గంటలు ఆమెతో కబుర్లు చెప్పి వెళ్ళాడు.

గురువారం

షరా....

శుక్రవారం

షరా; ఇవాళ మీ ఎదురింటి ఇంజనీర్ బావమరిది కూడా చూసి వెళ్ళాడు.

డిటెక్టివ్ని నియమించి జ్వాల ప్రాణాన్ని కాపాడి తను రెండో తప్పు చేసాననుకున్నాడు సోమనాధ్.

## అటు దిటు

హైద్రాబాద్ సంబంధం అనగానే సర్వలక్ష్మికి ఎంతో ఆనందం కలిగింది. ఖమ్మం సంబంధం బదులు ఆ సంబంధం కుదరాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

కనీసం ఏ దేముడైనా కరుణించి వుంటాడు. హైద్రాబాద్లో నేషనల్ సేంపిల్ సర్వే కార్యాలయములో పనిచేసే రమేష్తో ఆమె వివాహం జరిగిపోయింది.

సర్వలక్ష్మికి హైద్రాబాద్లో కాపరం కావాలనుకోడానికి ముఖ్య కారణం అక్కడున్న టేంక్బండ్ అనేక తెలుగు సినిమాల్లో టేంక్ బండ్ని చూసింది. పెళ్ళయ్యాక తనభర్త టేంక్బండ్ మీద వుండే

సిమెంట్ బెంచీమీద కూర్చుని నీళ్ళ వంక చూస్తూ మనస్సును స్పందించే తియ్యటి మాటలని మాట్లాడుకోవాలనే కోరిక సర్వలక్ష్మిలో ప్రబలంగా వుంది.

రమేష్ ఇల్లు వాల్మీకినగర్‌లో అది టేంక్‌బండ్‌కి కిలోమీటర్ లోపే అని తెలిసాక సర్వలక్ష్మికి మరి కాస సంతోష పడింది.

సర్వలక్ష్మి ఊహలకి, ఆశలకి సరిపడే మనిషికాడు రమేష్. ప్రాక్టికల్, రొమాంటిక్ కాదు. ఉద్యోగం చేస్తూ, తీరిక వేళల్లో చిన్న ఫోటో స్టూడియో నడుపుతున్నాడు అవుట్‌డోర్‌లో ఫోటోలు తీయడానికి తరచూ వెళుంటాడు సర్వలక్ష్మి సాయంత్రాలు టేంక్‌బండ్‌కి వెళ్ళి కూర్చుందామనీ ఎన్నిసార్లు అడిగినా ఏదో పనిపడటంతో కుదరనే లేదు.

వానాకాలం వచ్చేసింది, అసలు కుదరదు తర్వాత చలికాలం ఇంట్లోనే చలి భరించలేని సర్వలక్ష్మి టేంక్‌బండ్‌కి వెళ్ళలేదు.

సర్వలక్ష్మికి పెళ్ళయిన పదకొండు నెలలతర్వాతనెలతప్పింది సంతోషంతో ఏం కావాలని అడిగాడు రమేష్ ఇంకేం అడుగుతుంది?

ఇద్దరు ఆ సాయంత్రం టేంక్‌బండ్‌కి వెళ్ళి కూర్చున్నారు. అనేకసార్లు వంటరిగా వచ్చినా భర్తతో రావడం వల్ల సర్వలక్ష్మికి ఎంతో ఆనందంగా వుంది ఆ అనుభవం.

అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆ చెయ్యి నిమురుతూ చెప్పింది

"అక్షరాలకి అందని అనుభూతి ఇది"

అలా వూరికే అక్కడ కూర్చోవడం అంటే విలువైన కాలాన్ని వృథా చేసుకోవడమే అని భావించే రమేష్‌కి ఎంతో విసుగ్గా వుంది.

"రేపు వుదయం కూరలేం తీసుకురాను" అడిగాను.

సర్వలక్ష్మి కొద్దిగా చిన్నబోయింది కాసేపు మాట్లాడలేక పోయింది.

"ఈ వారం అరవై రెండు రోల్స్ ఖర్చయ్యాయి. నెగిటివ్‌లని వుంచడానికి ఓ క్రొత్త రేక్ చేయించాలి బిల్ పుస్తకం సైజు తగ్గిస్తే...."

"ఇక వెళదాం" లేచి నిలబడి చెప్పింది స్వరలక్ష్మి వెంటనే.

* * * *

రెండేళ్ళ తర్వాత ఓ రోజు సాయంత్రం సర్వలక్ష్మి వాళ్ళిద్దరి కోసం ఎదురుచూస్తోంది. ఆమె మరిదికి పెళ్ళయింది. తోటికోడలు కాపురానికి వచ్చి వారమైంది

"టేంక్‌బండ్ దాకా వెళ్ళొస్తాం వదిన" చెప్పాడు మరిది అర గంట క్రితమే.

తన మరిది రమేష్ లా ప్రాక్టికల్ కాదు స్పందన వున్న వ్యక్తి అని సర్వలక్ష్మికి తెలుసు. అతని భార్య ఆ విషయంలో తనకన్నా ఎంతో అదృష్టవంతురాలు అని అనేకసార్లు అనుకుంది సర్వలక్ష్మి

టేంక్‌బాండ్ నించి తిరిగివచ్చాక మరిదిని చనువుగా అడిగింది.

"ఏం చేశారక్కడ?"

"ఏమిటో వదినా నా పెళ్ళానికి డబ్బు పిచ్చి తప్ప ఇంకోటిలేదు. ఏదయినా సరదాగా నాలుగు మాటలు మాట్లాడనివ్వకుండా, మీ అన్నయ్యలా మీరు ఓ స్వంత వ్యాపారం చేయకూడదు? మీది పెద్దాఫీసుగా " మీ కొలీగ్స్‌కి బట్టలు ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో అమ్మొచ్చు." అంటూ మొదలెట్టింది. చెప్పాడతను.

## లెక్కలమాష్టారి భార్య

కొత్తగా పెళ్ళయి కోటి కోరికలతో విశ్వనాథ్ ఇంట్లో కాపురానికి అడుగుపెట్టిన సింధూకు మొదటిరోజే పెద్ద అఘాతం తగిలింది.

చేబ్రోలులో వివాహం జరిపించారు సింధూ తల్లిదండ్రులు.

హైదరాబాద్‌లో లెక్కల మాష్టారుగా పనిచేసే విశ్వనాథ్ ఉదయం భార్యని సీతాఫలమండిలోని తమ ఇంటికి తీసుకువచ్చాడు. భోజనంచేసి సైకిలేసుకొని స్కూలుకి వెళ్ళిపోయాడు.